క్లుప్తంగా

నలంద కేడెట్‌లకు ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్‌లు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద కేడెట్స్ ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో వారికి శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, ఎన్‌సీసీ పీఐ స్టాఫ్ హవల్దార్ ప్రదీప్‌లు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం చేస్తుందని చెప్పారు. ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ ఉత్తీర్ణులైన వారు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎన్‌సీసీ కోటాను పొందుతారని పేర్కొన్నారు. తమ కళాశాల నుంచి 29 మంది కేడెట్‌లు పరీక్షకు హాజరు కాగా, వందశాతం ఉత్తీర్ణులైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓ కె సుధాకర్ పాల్గొన్నారు.

బాలుడు గుండె ఆపరేషన్‌కు రూ.50 వేలు సాయం



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): తోటి వారికి సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ అన్నారు. అశోక్ నగర్‌లోని చారిటీస్ కార్యాలయం ఆవరణలో 22 రోజుల బాలుడుకి గుండె ఆపరేషన్‌కు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని యలమంచిలి జయప్రకాష్ బాలుడు తల్లిదండ్రులకు స్వయంగా శుక్రవారం అందచేశారు. జయప్రకాష్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని నిడమానూరు గ్రామానికి చెందిన పృథ్వి దంపతులు తమ బాబుకు గుండె ఆపరేషన్‌కు సహాయం చేయాల్సిందిగా కోరారని, తాను వెంటనే స్పందించి వైద్యులతో మాట్లాడి రూ.50 వేలు అందచేస్తున్నానని జయప్రకాష్ చెప్పారు. వైఎన్నార్ చారిటీస్ సభ్యులతో పాటుగా డాక్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



కృష్ణలంక(విజయవాడతూర్పు): కనకదుర్గ వారధి సర్కిల్ సమీపంలో బందరు కాలువ ఒడ్డున ఉన్న వారాహి పీఠంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చనలు నిర్వహించారు. అరుణానందస్వామి వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి 154 మంది మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిపించారు. వ్రతంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అమ్మవారి రూపు, పసుపు, కుంకుమ,పండ్లు, చీర ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాయ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ఎగ్జిబిషన్



కృష్ణలంక(విజయవాడతూర్పు): బందరురోడ్డులోని బాపు మ్యూజియంలో భావనారుషి చేనేత హస్తకళా కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ఎగ్జిబిషన్ నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ నెల 14న ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ సెప్టెంబర్ 14వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 11నుంచి రాత్రి 9 గంటలకు వరకు అమ్మకాలు, ప్రదర్శన ఉంటుందని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు సురేష్ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత పట్టు, డ్రస్ మెటీరియల్స్, టాప్‌లు, చుడీదార్లు, బెంగాలీ కాటన్, పోచంపల్లి, కలంకారీ, వెంగటగిరి, మంగళగిరి, ఉప్పాడ, నారాయణపేట, ఫ్యాన్సీ చీరలు, బెడ్ షీట్లు, వివిధ రకాల జ్యూయలరీ, 1గ్రామ్ గోల్డ్ హారాలు, ఆభరణాలు, ప్రత్యేక రంగులు, డిజైన్‌లతో తయారు చేసిన చేనేత ఉత్పత్తులు మహిళలను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భగవాన్ వెంకయ్య స్వామి 11వ ఆరాధనోత్సవం (నెల్లూరు జిల్లా గొలగమూడిలో 43వ ఆరాధన) సందర్భంగా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని వీరాంజనేయ సహిత వెంకయ్య స్వామి మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఆరాధనోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

ఉచితం..నిష్ప్రయోజనం!

- ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగం లేని వైనం
- జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది విద్యార్థులు నగరానికి రాక
- సరిపడిన బస్సులు లేక అవస్థలు





ఆటోనగర్ బస్టాండ్ వద్ద అధిక సంఖ్యలో ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో ఎంతో ఆర్భాటంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించినా తమకు ప్రయోజనం ఉండటం లేదని విద్యార్థినులు అంటున్నారు. సరిపడినన్ని బస్సులు లేకపోవడం వల్ల తాము ప్రయాణాలు చేయలేకపోతున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదువులు నిమిత్తం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రోజూ విజయవాడ వచ్చి వెళ్లే విద్యార్థినులు బస్సులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి బస్సులు నడపకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. బస్సులు అందుబాటులో లేకపోవడంతో కళాశాలల నుంచి తాము ఇళ్లకు వెళ్లే సరికి రాత్రి బాగా పొద్దుపోతోందని వాపోతున్నారు. స్థానిక ఆటోనగర్ టెర్మినల్ బస్‌స్టాండ్ వద్ద పలువురు విద్యార్థినులు సాక్షితో మాట్లాడారు. ఉదయం 7 గంటల తర్వాత ఒక్క బస్సు కూడా గ్రామంలోకి రావడం లేదని కంకిపాడు, గుడివాడ, ఉయ్యూరుతో పాటు పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు చెప్పారు. మరీ ముఖ్యంగా గుడివాడకు పల్లెవెలుగు బస్సులు చాలా తగ్గించారని తెలిపారు. గత 3 రోజుల నుంచి ఇంటికి వెళ్లే సరికి రాత్రి 10 గంటలు అవుతుందని పేర్కొన్నారు. ఆటోనగర్ సిటీ టెర్మినల్ బస్ స్టేషన్‌కు 10, 55 నెంబరు బస్సులే వస్తున్నాయని కంకిపాడు, ఉయ్యూరు వెళ్లేందుకు బస్సుల కోసం ఉదయం, సాయంత్రం పడిగాపులు కాయాల్సి వస్తుందని అంటున్నారు. బస్సులు లేకపోవడంతో ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల ద్వారా ఇళ్లకు చేరుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇలాగే అయితే కాలేజీకి ఎలా వెళ్లాలని ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ కాలేజీలకు వెళ్లే విద్యార్థులు బస్సులకువేలాడి వెళుతున్నారు. బస్సులన్నీ పై నుంచి రద్దీగా రావడం వల్ల బస్టాప్‌లో ఉన్న ప్రయాణికులతో పాటు కాలేజీ విద్యార్థులు సైతం ఎక్కలేకపోతున్నారు. ఇంటికి వెళ్లాలంటే బస్సు ఎక్కాలంటే యుద్ధం చేయాల్సిన పని అవుతుందని వాపోతున్నారు. ఉచిత బస్సు పెట్టినప్పటి నుంచి నానా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.

కార్మికులకూ తప్పని ఇబ్బందులు..

కార్మికవాడకు విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 50 వేలమందికిపైగా కార్మికులు పనులు చేసేందుకు వస్తుంటారు. సింగ్‌నగర్, పాయికాపురం, డాబాకొట్ల సెంటర్, కండ్రిక, నున్న ప్రాంతాలకు చెందిన కార్మికులు పనులకు వస్తుంటారు. వీరు కూడా పనులు ముగించుకున్న తర్వాత ఇంటికి వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. మరీ ముఖ్యంగా మహిళా కార్మికులు బస్‌స్టాప్‌ల వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఆటోనగర్‌కు 48 బస్సుతో పాటు 11 నెంబరు, 5వ నెంబరు బస్సులు మాత్రమే వస్తుంటాయి. గత నాలుగు రోజుల నుంచి సాయంత్రం వచ్చే బస్సులు సమయానికి రాకపోవడం వల్ల బస్‌స్టాప్‌లకు మాత్రమే పరిమితమవుతున్నారు.

రెండు గంటల నుంచి ఉన్నా

కంకిపాడు వెళ్లడానికి రెండు గంటల నుంచి బస్సు కోసం వేసి ఉన్నా. ఒకటవ నంబరు బస్సు రాలేదు. నిన్న రాత్రి ఇంటికి వెళ్లే సరికి 9 గంటలు అయింది. మరలా మరుసటి రోజు పెందలకడనే లేచి కాలేజీకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది.

–నక్షత్ర, ఇంటర్ విద్యార్థిని

చాలా ఇబ్బందిగా ఉంది

గత రెండు రోజుల నుంచి సిటీ బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ఇంటికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. నేను ప్రతి రోజూ గుడివాడ నుంచి విజయవాడ కాలేజీకి రావాలి. బస్సులు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంది.

–స్మైలీ, విద్యార్థిని

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): మాచవరం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్‌ల మరమ్మతులు నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా మాచవరం ఫీడర్ పరిధిలోని గుణదల పడవలరేవు ఏరియా, పిచ్చమ్మ తల్లి గుడి ఏరియా, మాచవరం రెవిన్యూ కాలనీ, గ్రంథాలయం ఏరియా, మాచవరం డౌన్ కొండవైపు ఏలూరు రోడ్ ఏరియా, కార్మికనగర్ కొండ ప్రాంతం, యారంవారి వీధి, ఎలిశల వారి వీధి, వాటర్ ట్యాంక్ రోడ్, ప్రతిభానికేతన్ రోడ్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట 11 కేవీ జేడీ నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మరమ్మతులు నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జేడీనగర్, లక్ష్మీపతినగర్, డొంకరోడ్డు ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

రేపు జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని రాఘవయ్య పార్కు సమీపంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24వ తేదీన ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సు నిర్వహిస్తున్నామని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ పెరుగుదల–నివారణ పద్ధతులు, ఆరోగ్యరంగ ప్రైవేటీకరణ–ప్రభావాలు– పరిష్కారాలు అనే అంశాలపై సదస్సు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, అందరికీ సమాన ఆరోగ్య సేవలు అందించడం, వైద్య ఆరోగ్యరంగ ప్రైవేటీకరణ ప్రభావాలపై ప్రసంగిస్తారని చెప్పారు.

ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నిర్మల జ్యోతి బాయి



డాక్టర్ నిర్మల జ్యోతి బాయిని అభినందిస్తున్న డాక్టర్ బుల్లయ్య తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని డాక్టర్ నోరిరామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నిర్మల జ్యోతి బాయి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయుర్వేద కళాశాల స్థాపించి వందేళ్ల పూర్తికాగా, తొలిసారిగా ఒక మహిళ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడం విశేషంగా చెబుతున్నారు. ఆమె అనుభవం, అంకితభావం కళాశాల అభివృద్ధికి తోడ్పడతాయని పలువురు కలిసి అభినందనలు తెలిపారు. కాగా ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలియచేసిన వారిలో ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ టి.బుల్లయ్య, డాక్టర్ వి. శ్రీధర్‌తో పాటు, నేషనల్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ వి.భానుప్రకాష్ తదితరులు ఉన్నారు.

ప్రొఫెసర్‌లుగా పదోన్నతి.....

ఆయుర్వేద కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్ కోలా విజయకుమారి, డాక్టర్ టి బుల్లయ్యలు పోస్టు గ్రాడ్యుయేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారికి సహచర ప్రొఫెసర్లు అభినందనలు తెలియచేశారు.

రేపు డయాబ్ ఎండోకాన్ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ యలమంచి సదాశివరావు, హిమన, ఐశ్వర్య

లబ్బీపేట(విజయవాడతూర్పు): మధుమేహానికి ఆధునిక చికిత్సలపై అవగాహన కలిగించేందుకు ఈ నెల 24న డయాబ్ ఎండోకాన్ 2025 సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్యుడు డాక్టర్ యలమంచి సదాశివరావు తెలిపారు. ఇన్సులిన్ ఇంజక్షన్స్‌కు ప్రత్యామ్నాయంగా ఇన్‌హేలర్స్ అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. విజయవాడ సూర్యారావుపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సదస్సు పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదాశివరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ సదస్సులో 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఆధునిక వైద్య చికిత్సలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకు రావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రస్తుతం మధుమేహ నియంత్రణలో శరీర బరువు నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. బరువును క్రమబద్ధీకరించడం ద్వారా మధుమేహం నియంత్రణలో ఉండటంతో పాటు, గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అమర్‌పాల్ సింగ్‌కు గోల్డ్‌మెడల్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ హిమన యలమంచి, ఐశ్వర్య, అమూల్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయం

కమిషనర్ ధ్యానచంద్ర



డ్రెయిన్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయమని, విజయవాడ నగరంలోని మేజర్ ఔటఫాల్ డ్రెయిన్స్ అన్నిటికీ రెయిలింగ్స్ పెట్టాలని, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కొత్తపేట, పంజా సెంట్రర్, డ్రెయిన్‌వీధి, సుబ్బరామయ్య వీధి, గాంధీ హిల్, గవర్నర్‌పేట వెహికల్ డిపో ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే నగరంలో మేజర్ ఔట్ ఫాల్ డ్రెయిన్స్‌కి రెయిలింగ్స్ పెట్టే పనులు మొదలైనప్పటికీ పూర్తి స్థాయిలో పనులను చేయాలని సూచించారు. గాంధీ హిల్ వద్ద ఎస్కలేటర్ ద్వారా జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. రైలింగ్స్ పెట్టేటప్పుడు డీసిల్టింగ్ పనులకు ఇబ్బంది లేకుండా వాటికి నాలా మ్యాన్ సరిపోయేంత దూరంలో ఒక గేటును అమర్చాలని తెలిపారు. పర్యవేక్షణ ఇంజినీర్ పి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్రీనివాస్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేడియంలో వసతులు పెంచండి



ప్రమాదకరమైన స్థితిలో ఉన్న గదులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ నిర్వహణలో ఉండే స్టేడియాల్లో వసతులను పెంచాలని, పాతవి పాడైపోయిన ప్రమాదకరమైన భవనాలను, గదులను సీజ్ చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బందర్ రోడ్డులోని దండమూడి రాజగోపాలరావు స్టేడియంను శుక్రవారం ఆయన పరిశీలించారు. స్టేడియంలో ఆడుకునేందుకు వచ్చేవారి కోసం మరిన్ని వసతుల్ని పెంచాలని, స్కేటింగ్ రింక్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. స్టేడియంలో ప్రమాదకరమైన మూడు గదులను గుర్తించారు. అందులో ఒక గదిని వెంటనే సీజ్ చేసి అందులోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీర్లు స్ట్రక్చరల్స్ స్టెబిలిటీ చూసి, వాటిపై సరైన చర్యలు తీసుకోవాలని, స్టేడియం ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణలో సక్రమంగా ఉండాలని చెప్పారు. ఈ పర్యటనలో ఎస్టేట్ ఆఫీసర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ డాక్టర్ ఎ.శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండండి



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానదికి వస్తున్న భారీ వరదల నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణలంక సీఐ నాగరాజు సూచించారు. స్టేషన్ పరిధిలోని రణదీవె నగర్, పద్మావతి ఘాట్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. నదిలో స్నానం చేస్తున్న వారికి, సెల్ఫీలు, ఫొటోలు దిగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి అక్కడ నుంచి పంపివేశారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ నుంచి భారీగా వరదను దిగువకు విడుదల చేస్తుండడంతో దానిని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్న యువత ఘాట్ వద్దకు వచ్చి ఫొటోలు,సెల్ఫీలు దిగుతున్నారని చెప్పారు. నదీ ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉన్నందున వరదల తగ్గుముఖం పట్టేవరకు నదిలోకి దిగి ఫొటోలు, సెల్ఫీలు దిగడం వంటివి మానుకోవాలని సూచించారు. స్టేషన్ సిబ్బంది నిత్యం కరకట్ట దిగువ ప్రాంతాలు, పుష్కర ఘాట్‌లను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాతపాడులో స్వామిత్వ సర్వే



పాతపాడు(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం పాతపాడు గ్రామంలో సచివాలయం సిబ్బంది స్వామిత్వ సర్వే చేస్తున్నారు. గ్రామ కంఠంలో ఇళ్లను సర్వే చేస్తున్నారు. ఇంటి కొలతలు, స్థలం కొలతలు కొలుస్తూ సరిహద్దుల వివరాలను నమోదు చేస్తున్నారు. పాతపాడు గ్రామంలో సుమారు 350 ఇళ్ల కొలతలు సేకరించినట్టు సిబ్బంది చెప్పారు. కొలతల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తున్నారు. గ్రామం మొత్తం సర్వే పూర్తయిన అనంతరం ఐడి కార్డును ఇంటి యజమానికి ఇవ్వడం జరుగుతుందని చెబుతున్నారు. పాతపాడు గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, విలేజి సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంటు, ఇతర సచివాలయాల సిబ్బంది స్వామిత్వ సర్వేలో పాల్గొంటున్నారు. ఈ నెలాఖరు నాటికి గ్రామంలో సర్వే పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాతపాడు గ్రామంతో పాటు అంబాపురం, పి.నైనవరం గ్రామాల్లో స్వామిత్వ సర్వే నిర్వహిస్తున్నారు.

నగరంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



లబ్బీపేట(విజయవాడతూర్పు): మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీలోని ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో మహిళలను ఆకట్టుకుంటుంది. ఈ నెల 21న ప్రారంభమైన ఈ ప్రదర్శన 26 వరకూ కొనసాగనుంది. వినాయకచవితి, దసరా పండుగలతో పాటు, వివాహాది శుభకార్యాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో దేశంలోని విభిన్న ప్రాంతాల సాంస్కృతిక, సంప్రదాయ వస్త్రాలను, మగ్గాలపైన తయారు చేసిన ఉత్పత్తులను ఏర్పాటు చేశారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ చీరలు, బ్లౌజులు, కుర్తీలు ఆకట్టుకుంటున్నారు. ప్రదర్శనలోని పైథానీ సిల్క్ చీరలు, బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్ , కాషిదా సిల్క్ చీరలు, చందేరి – మహేశ్వరి సిల్క్ – హ్యాండ్ పెయింట్, బలుచారి, జమ్దానీ, తంగైల్, ధకై మస్లిన్ సిల్క్ వస్త్రాలు అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు



మాట్లాడుతున్న ఆర్.వెంకటరావు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నూతనంగా పరిశ్రమల స్థాపించాలనుకునే వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల పేరుతో అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.వెంకటరావు చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనే యువతకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. వెంకటరావు మాట్లాడుతూ జనశిక్షణ సంస్థాన్‌లో వృత్తి విద్యా కోర్సులను నేర్చుకున్న వారు పారిశ్రామిక వేత్తలుగా ఎదగవచ్చునని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారని తెలిపారు. స్వయం ఉపాధి కోర్సులు నేర్చుకున్న వారు నిధులు లేకపోవడం వల్ల సొంతంగా ఉత్పత్తి చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. అటువంటి వారి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాల పేరుతో సబ్సిడీతో రుణాలను మంజూరు చేయిస్తున్నాయని వెల్లడించారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంలో భాగంగా లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణాలను పొందవచ్చునని వివరించారు. ఇందులో 35 శాతం వరకు రాయితీ ఇస్తోందన్నారు. ఈ పథకానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్నా మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులను నేర్చుకున్న వారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. ప్రమోషన్ ఆఫీసర్స్, ఎన్‌వీ సత్యనారాయణ, ఎం.లావణ్య, జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో నేరాల రేటు పెరుగుదల



మాట్లాడుతున్న ఈగల్ టీం ఎస్ఐ వీరాంజనేయులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీం ఎస్ఐ వీరాంజనేయులు అన్నారు. కృష్ణలంకలోని పొట్టిశ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో శుక్రవారం మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగంతో నేరాల రేటు పెరుగుతుందని తెలిపారు. సమాజంపై హానికరమైన ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి బంగారంలాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్, గంజాయి, కొకైన్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు గానీ, 1972 నంబర్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. కృష్ణలంక పీఎస్ ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తుపదార్థాల వ్యసనం తీవ్రమైన ఆందోళనకరంగా మారుతుందని పేర్కొన్నారు. పూర్తి అవగాహనతో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చని స్పష్టం చేశారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్‌బాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. ఈ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు, యువతకు నూజివీడు మండలం పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రిన్సిపాల్ కోటేశ్వరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, అధ్యాపకులు ఉషారాణి, ప్రసాద్, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ ఎస్‌కె నజ్మా, జాకబ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో యూరియా, ఇతర ఎరువులు పక్కదారి పట్టకుండా ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు చేపడతామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ఎరువుల సరఫరాపై నిరంతర నిఘాతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎరువుల సరఫరాపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువులు ఎక్కడా పక్కదారి పట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రి, సీఎస్ దిశానిర్దేశం చేశారు. కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.